క్లుప్తంగా

ఫేస్ పింఛన్ స్లో



వృద్ధురాలి ఫేస్‌ను నమోదు చేస్తున్న అధికారి

జగదేవ్‌పూర్(గజ్వేల్): పింఛన్‌దారులకు నూతనంగా ప్రవేశపెట్టిన ఫేస్ పింఛన్ బుధవారం ప్రారంభమైంది. జగదేవ్‌పూర్ పోస్టు కార్యాలయం ఎదుట పింఛన్‌దారులు బారులు తీరారు. మొదటి రోజు కావడంతో ఆన్‌లైన్‌లో పింఛన్‌దారుడి ముఖం నమోదు చేయడంలో ఆలస్యం కావడం వల్ల పింఛన్‌దారులు కార్యాలయం ఎదుట గంటల తరబడి పడిగాపులు కాయాల్సి వచ్చింది. వరుసక్రమంలో పింఛన్ అందిస్తారని ఎవరూ ఆందోళన చెందవద్దని కార్యదర్శి రాంరెడ్డి పేర్కొన్నారు.

యూరియా ఎక్కువగా వాడొద్దు

జగదేవ్‌పూర్(గజ్వేల్): పంటలకు ఎక్కువ మొత్తంలో యూరియాను వాడొద్దని మండల వ్యవసాయ అధికారి వసంతరావు సూచించారు. బుధవారం మండలంలోని చాట్లపల్లి, వట్టిపల్లి గ్రామాల్లో రైతులకు అవగాహన కల్పించారు. అలాగే ఫెర్టిలైజర్ దుకాణాలను తనిఖీ చేసి, పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు యూరియాను ఎక్కువగా వాడితే పంటకు నష్టం జరుగుతుందన్నారు. నానోయూరియా, డీఏపీ వాడాలని తెలిపారు. 5 వందల మీ.లీ నానో యూరియా 45 కిలోల యూరియాతో సమానమని వివరించారు. అధిక వర్షాలతో పత్తి పంటకు పారావిల్ట్ వస్తుందని, రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టాలన్నారు.

మహిళల ఆర్థికాభివృద్ధికి కృషి



మాట్లాడుతున్న ఏపీఎం ఆంజనేయులు

చిన్నకోడూరు(సిద్దిపేట): మహిళలు ఆర్థికంగా అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని ఏపీఎం ఆంజనేయులు అన్నారు. బుధవారం మండలంలోని పెద్దకోడూరు, చిన్నకోడూరు గ్రామాల్లో ఇందిరా మహిళా శక్తి సంబరాల కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళల ఆర్థికాభివృద్ధికి ఇందిరా మహిళా శక్తి పథకం దోహదపడుతుందన్నారు. ప్రభుత్వం అందజేసే వడ్డీలేని రుణాలను మహిళా సంఘాలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రమాదబీమా, రుణ బీమా అమలులో ఉంటుందన్నారు. కార్యక్రమంలో సీసీ శ్రీనివాస్‌రెడ్డి, వీఓఏలు, సమాఖ్య సభ్యులు పాల్గొన్నారు.

అగ్నివీర్ అభ్యర్థులకు ఉచిత శిక్షణ

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): అగ్నివీర్ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులకు ఆగస్టులో జరగనున్న ఫిజికల్ పరీక్షల కోసం, విజేత పోలీస్ అండ్ డిఫెన్స్ అకాడమీ వారు ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్లు సీనియర్ ఫిజి కల్ శిక్షకులు ఉప్పలయ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలో విజేత పోలీస్ అండ్ డిఫెన్స్ అకాడమీ ఆధ్వర్యంలో ప్రతిరోజు ఉ.6 గంటల నుంచి 8 గంటల వరకు, సా.5 గంటల నుంచి 7గంటల వరకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. పూర్తి వివరాలకు (7661996167, 9989862806) సంప్రదించాలన్నారు.

టెక్నాలజీతో ఫోన్ల రికవరీ

హుస్నాబాద్: సెల్‌ఫోన్ పోయిందని టెన్షన్ పడకుండా వెంటనే సీఈఐఆర్‌లో డాటా నమోదు చేసుకుంటే ఫోన్ ఎక్కడుందో కనిపెట్టవచ్చని ఏసీపీ సదానందం తెలిపారు. హుస్నాబాద్ డివిజన్ పరిధిలో పోయిన, దొంగిలించిన రూ.2.20 లక్షల విలువ గల 13 సెల్ ఫోన్లను సీఈఐఆర్ టెక్నాలజీతో రికవరీ చేసి బుధవారం బాధితులకు అందజేశారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ.. ఫోన్ దొంగతనం జరిగినా, పడిపోయిన వెంటనే స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో సీఐ శ్రీనివాస్, ఎస్సై లక్ష్మారెడ్డి, డివిజన్ పోలీస్‌లు పాల్గొన్నారు.

వ్యాపారులకు జరిమానా

సిద్దిపేటజోన్: నిబంధనలు అతిక్రమించి ప్లాస్టిక్ వినియోగిస్తున్న వ్యాపారులకు మున్సిపల్ అధికారులు బుధవారం జరిమానా విధించారు. మున్సిపల్ కమిషనర్ ఆదేశాల మేరకు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలు వ్యాపార, వాణిజ్య సంస్థలకు జరిమానా విధించి, నోటీసులు జారీ చేశారు.

నిజాయితీ చాటుకున్న విద్యార్థిని

చేర్యాల(సిద్దిపేట): ఓ విద్యార్థిని తనకు దొరికిన మొబైల్‌ను పోలీసుల ద్వారా బాధితుడికి అప్పగించి నిజాయితీ చాటుకుంది. మండలంలోని ముస్త్యాలకు చెందిన దీపిక బాసర ట్రిపుల్‌ఐటీలో చదువుతుంది. ఆమె నిజామాబాద్ నుంచి బస్సులో వస్తున్న సమయంలో ఫోన్ దొరికింది. వెంటనే ఆ ఫోన్‌ను చేర్యాల పోలీసులకు అప్పగించి తన నిజాయితీ చాటుకుంది. టెక్నాలజీ ద్వారా ఫోన్ పోగొట్టుకున్న వ్యక్తి వివరాలు తెలుసుకున్న చేర్యాల పోలీసులు బుధవారం బాధితుడికి ఫోన్ అప్పగించారు.

అధిక వర్షాలా.. రక్షణ ఇలా!



పత్తి పంటలో నిలిచిన వర్షపు నీరు

- పంటల రక్షణపై సూచనలు, సలహాలు
- ఏరువాక కేంద్రం, శాస్త్రవేత్త, డా.సీహెచ్ పల్లవి



సిద్దిపేటరూరల్: ప్రస్తుతం సిద్దిపేట జిల్లాలో గడిచిన వారం రోజుల్లో 150 మి. మీ. వర్షపాతం నమోదైంది. ఈ క్రమంలో రైతుల పంటలకు ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్ డా.సిహెచ్ పల్లవి పలు సూచనలు సలహాలు చేశారు. రాబోయే 3-5 రోజుల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ సూచనలు ఉన్నాయన్నాయరు. భారీ వర్షాలు కురిసిన ప్రాంతాల్లో మెట్ట పంటలు పత్తి, మొక్కజొన్నలో నీరు నిల్వ ఉండకుండా తీసివేయాలి. జూన్, జూలై మాసాల్లో వర్షాలు లేక పంటలు విత్తిన వెంటనే బెట్టకు గురై ఎండి పోయే ప్రమాదం ఉందన్నారు. అధిక వర్షాలకు వివిధ పంటలలో చేపట్టవలసిన యాజమాన్య పద్ధతులు చేపట్టాలని తెలిపారు.

వరి పంట...

నీరు సమృద్ధిగా ఉన్న ప్రాంతాల్లో రైతులు స్వల్పకాలిక (120-125 రోజుల) వరి రకాల నారుమళ్ళు జూలై 31వ తేదీ వరకు పోసుకోవడానికి అనువైన సమయం ఉందన్నారు. 30 - 25 రోజుల వయస్సు ఉన్న మధ్యకాలిక, స్వల్పకాలిక వరి రకాలను నాటుకోవాలి. మధ్యకాలిక వరి రకాల నారు 40 రోజుల వయస్సు , దీర్ఘకాలిక వరి రకాల నారు 50 రోజుల వయస్సులో బాగా ముదిరి ఆలస్యంగా నాటినప్పుడు ఆకు చివరలను తుంచి నాటువేయా లని తెలిపారు. ముదురు నారును నాటేటప్పుడు, సాధారణం కంటే ఎక్కువ మొక్కలను ఒకే కుదురులో నాటాలి. వరిలో నాటు వేసుకునేటప్పుడు ఒక బ్యాగ్ డీఏపీ (50 కిలోలు) + 15 కిలోల పోటాష్‌ను చల్లుకోవాలి. ముదురు నారు నాటిన 10 రోజులలోపు 60 కిలోలు యూరియాను వేసుకోవాలి.

పత్తి పంట సాగు..

- వర్షాలు తగ్గిన తరువాత ఎకరాకు 25 కిలోల యూరియా, 20కిలోల మ్యూరేట్ ఆఫ్ పోటాష్ రసాయనిక ఎరువులను పైపాటుగా 20 రోజుల నుంచి 40 రోజుల వయసున్న పంటకు మొక్కల మొదళ్ళలో 7-10 సెం. మీ దూరంలో పాదులుతీసి రసాయనిక ఎరువులను వేసి మట్టితో కప్పాలి. .
- ముంపుకు గురైన పంట వేర్ల ద్వారా పోషకాలు తీసుకోలేనందున పైపాటుగా 19:19:19 లేదా 13-0-45 లేదా 10 గ్రా. యూరియా లీటరు నీటికి కలిపి వారం రోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారీ చేయాలి.
- నేల ద్వారా వ్యాప్తి చెందే తెగుళ్ళను నివారించుటకు 3 గ్రా. కాపర్-ఆక్సిక్లోరైడ్ లేదా 2 గ్రా. కార్బెండజిమ్ + మ్యాంకోజెబ్ శిలీంధ్రనాశక మందును లీటరు నీటికి కలిపి నేల బాగా తడిచేలా వారం వ్యవధిలో రెండు సార్లు పిచికారీ చేయాలి.

మొక్కజొన్న పంట సాగు...

- మొక్కజొన్న శాకీయ దశలో ఎక్కువ నీటిని తట్టుకోలేదు.. పొలం నుంచి నీటిని వెంటనే తీసివేయాలి.
- అధిక వర్షాల వల్ల నేలలో భాస్వరం లోపం ఏర్పడి మొక్కలన్నీ ఊదారంగులోకి మారే అవకాశం ఉంది. కావున పంట వేర్ల ద్వారా పోషకాలు తీసుకోలేనందున పైపాటుగా వర్షాలు ఆగిన తర్వాత 5 గ్రా.19-19-19 లేదా 20 గ్రా. డీఏపీ మందును లీటరు నీటికి కలిపి మొక్కలపై పిచికారీ చేయాలి.

జొన్న పంట సాగు...

- ముందస్తు నివారణ చర్యల భాగంగా జొన్నలో కాండం తొలుచు పురుగు నివారణకు, పంట విత్తిన 30-35 రోజుల దశలో ఎకరాకు 4 కిలోల కార్బోఫ్యూరాన్ 3సిజి గుళికలను కాండం సుడులలో వేయాలి.

కంది పంట సాగు..

- ప్రస్తుత వాతావరణ పరిస్థితులు పంటలో ఫైటాప్తోర ఎండుతెగులు ఆశించుటకు అనుకూలం. తెగులు గమనించినచో, నివారణకు 2 గ్రా. మెటలాక్సిల్ మందును లీటరు నీటికి కలిపి నేల బాగా తడిచేటట్లు పిచికారీ చేయాలి.

అంబులెన్స్ సేవలు భేష్

జీవీకే ఈఎంఆర్ఐ గ్రీన్ హెల్త్ సర్వీసెస్ రాష్ట్ర ప్రతినిధి కిషోర్



అంబులెన్సు నిర్వహణను పరిశీలిస్తున్న కిషోర్

కొండపాక(గజ్వేల్): జిల్లాలోనే స్థానిక 108 అంబులెన్స్ సేవలు భేష్‌గా ఉన్నాయని జీవీకే ఈఎంఆర్ఐ గ్రీన్ హెల్త్ సర్వీసెస్ రాష్ట్ర ప్రతినిధులు కిషోర్ కితాబిచ్చారు. కొండపాక మండల 108 అంబులెన్స్ సేవలను బుధవారం పరిశీలించారు. అంబులెన్సు నిర్వహణ, రిజిస్టర్లు, వైద్య సేవలందుతున్న తీరులను క్షుణ్ణంగా పరిశీలించారు. కిషోర్ మాట్లాడుతూ.. సమాచారం అందిన వెంటనే ఘటనా స్థలా నికి చేరుకోవాలన్నారు. గోల్డెన్ అవర్‌లోనే చికిత్సలు అందేలా చూసుకోవాలన్నారు. జిల్లా వ్యాప్తంగా కొండపాక 108 అంబులెన్సు నిర్వహణ తీరులు భేష్‌గా ఉన్నాయంటూ సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో 108 అంబులెన్సు ప్రోగ్రాం మేనేజర్ షేక్ జాన్ షాహిద్, జిల్లా మేనేజర్ శ్రీహరి, సిబ్బంది మహేందర్, శ్రీనివాస్, రమేష్ పాల్గొన్నారు.

అంబులెన్స్ తనిఖీ

చేర్యాల(సిద్దిపేట): ఈఎంఆర్ఐ గ్రీన్ హెల్త్ సర్వీసెస్ సంస్థ అనుసంధానంతో అత్యవసర సేవలందిస్తున్నా అంబులెన్స్‌లను బుధవారం ఆ సంస్థ రాష్ట్ర నాణ్యత విభాగశాఖ తనిఖీ అధికారి కిషోర్, ఉమ్మడి జిల్లా ప్రోగ్రాం మేనేజర్ షేక్ జాన్ షాహిద్, జిల్లా మేనేజర్ హరి రామ కృష్ణ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు అంబులెన్స్‌లోని పరికరాల పనితీరు, రికార్డులను పరిశీలించారు.

విద్యుత్ సమస్యలు తలెత్తకుండా చర్యలు

విద్యుత్ శాఖ ఎస్ఈ చంద్రమోహన్



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎస్ఈ

కొండపాక(గజ్వేల్): విద్యుత్తు సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపట్టామని విద్యుత్తుశాఖ ఎస్ఈ చంద్రమోహన్ పేర్కొన్నారు. బుధవారం మండలంలోని ప్రజలతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు గ్రామాల్లో, వ్యవసాయ బావుల వద్ద విద్యుత్తు సమస్యలతో ఇబ్బందులు పడుతున్నామంటూ ఎస్ఈ తెలిపారు. అక్కడక్కడగా ఓవర్ లోడ్ సమస్యలతో బోరుమోటార్లు కాలిపోతున్న విషయాలను వారి దృష్టికి తెచ్చారు. ఈసందర్భంగా చంద్రమోహన్ మాట్లాడుతూ.. గతంలో కంటే మెరుగైన విద్యుత్తు సరఫరా అయ్యేలా ఏఈ సత్యం ప్రత్యేక దృష్టి సారించి పని చేస్తున్నారన్నారు. వివిధ సామగ్రిల కొరత కారణంగా గ్రామాల్లో, వ్యవసాయ బోరుబావుల వద్ద విద్యుత్తు సమస్యలున్నా విషయం వాస్తవమేనన్నారు. వినియోగదారులకు విద్యుత్తు పరమైన ఇబ్బందులు రాకుండా చూసుకోవాలని సిబ్బందికి సూచించారు. దుద్దెడ గ్రామంలోని బీసీ కాలనీలో సపరేట్‌గా ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాలన్న వినియోగదారుల వినతికి స్పందించి త్వరలో ఏర్పాటు అయ్యేలా చూస్తామన్నారు. నెలనెల క్రమం తప్పకుండా విద్యుత్తు బిల్లులు చెల్లించుకోవాలన్నారు. కార్యక్రమంలో లైన్ ఇన్‌స్పెక్టర్లు, జూనియర్ లైన్‌మెన్లు, ఆపరేటర్లు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

అథ్లెటిక్స్ పోటీలకు విద్యార్థులు ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

దుబ్బాకరూరల్: అక్బర్‌పేట భూంపల్లి మండలం పోతారెడ్డిపేట ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు రాష్ట్ర అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికయ్యారు. అండర్-12 గర్ల్స్ విభాగం లాంగ్‌జంప్‌లో హర్షవర్ధని, షాట్‌పుట్ ఈవెంట్‌లో దివ్య, జ్యావలింగ్ త్రోలో నందిని, అండర్ 12బాయ్స్ విభాగం జావలింగ్ త్రోలో సుశాంత్ ఎంపికయ్యారు. ఆగస్టు 3, 7 తేదీల్లో హనుమకొండ, జనగామలో జరిగే పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. విద్యార్థులను పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు.

ఖోఖో పోల్స్ అందజేత



ఖోఖో పోల్స్‌ను ఇస్తున్న సభ్యులు

మిరుదొడ్డి(దుబ్బాక): గజ్వేల్‌కు చెందిన క్రీడాజ్యోతి స్పోర్ట్స్ ఫౌండేషన్ సహకారంతో మిరుదొడ్డి తెలంగాణ మోడల్ స్కూల్ విద్యార్థులకు ఫౌండేషన్ సభ్యులు బుధవారం ఖోఖోకు సంబంధించిన పోల్స్‌ను అందజేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు ఎన్. విజయరేఖ, ఎన్.గోవర్ధన్‌రెడ్డి, నవీన్, నరేష్‌కుమార్, భాను, మోడల్ స్కూల్ ఫిజికల్ డైరెక్టర్ దేవరాజు పాల్గొన్నారు.

సీఎం, మంత్రుల ఫొటోలకు క్షీరాభిషేకం



క్షీరాభిషేకం చేస్తున్న మహిళలు, నాయకులు

సిద్దిపేటరూరల్: గత బీఆర్ఎస్ పాలనలో ఒక్క రేషన్ కార్డు కూడా ఇవ్వకుండా ప్రజలకు పథకాలకు దూరం చేసిన ఘనత బీఆర్ఎస్‌కే దక్కుతుందని కాంగ్రెస్ పార్టీ పార్టీ నాయకులు, బుస్సాపూర్ మాజీ సర్పంచ్ సదాశివారెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని ఇర్కోడ్ గ్రామంలో ప్రభుత్వం రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల మంజూరు చేసిన సందర్భంగా హర్షం వ్యక్తం చేస్తూ మహిళలు సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు గడ్డం వివేక్ వెంకటస్వామి, ఉత్తమ్‌కుమార్ రెడ్డి, పొన్నం ప్రభాకర్‌ల ఫ్లెక్సీలకు సదాశివారెడ్డి ఆధ్వర్యంలో క్షీరాభిషేకం చేశారు. సదాశివారెడ్డి మాట్లాడుతూ.. ఎన్నికల హామీల్లో భాగంగా ప్రభుత్వం ఏర్పాటైన కొద్ది రోజుల్లోనే పథకాలను అమలు చేస్తూ ప్రజా ప్రభుత్వంగా మారిందన్నారు. మండలంలో 972 మందికి నూతన రేషన్ కార్డులను పంపిణీ చేశా మని తెలిపారు. కార్యక్రమంలో మండల నాయకులు అంజిరెడ్డి, మల్లారెడ్డి, సురేశ్, శ్రీనివాస్‌రెడ్డి, అంజిరెడ్డి, రాజ్‌మహమ్మద్, దుర్గయ్య, రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి

బెజ్జంకి(సిద్దిపేట): మండలంలోని బేగంపేటలోని సెయింట్ జోసెఫ్ స్కూల్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో బుధవారం బెజ్జంకి ఎంఆర్‌సీ కేంద్రం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు జనార్దన్ మాట్లాడుతూ.. పాఠశాలలో రెండవ తరగతి చదువుతున్న పైనీ ప్రవస్త అనే విద్యార్థిని ఫీజు కోసం మంగళవారం ఇనుప స్కేల్‌తో టీచర్ బాదారని తెలిపారు. ఈ సంఘటనపై విచారణ జరపాలని డిమాండ్ చేశారు. అనంతరం బెజ్జంకి పోలీస్ స్టేషన్‌లో బాధిత విద్యార్థి తల్లిదండ్రులతో కలిసి ఫిర్యాదు చేశామని తెలిపారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి రూపేష్, ఏఐఎస్ఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

◆ 43 సెల్‌ఫోన్‌లు అందజేత

సిద్దిపేటకమాన్: పోగొట్టుకున్న వివిధ రకాల సెల్ ఫోన్‌లను బాధితులకు అప్పగించినట్లు ఏసీపీ రవీందర్‌రెడ్డి తెలిపారు. పట్టణంలోని పలు ప్రాంతాలలో గత కొద్ది రోజుల క్రితం పలువురు తమ సెల్‌ఫోన్‌లను పోగొట్టుకున్నట్లు బాధితులు సంబంధిత పోలీసు స్టేషన్‌లలో ఫిర్యాదు చేశారు. నూతన టెక్నాలజీ సాయంతో గుర్తించి 43మందికి ఏసీపీ కార్యాలయంలో వన్‌టౌన్ సీఐ వాసుదేవరావు, టూటౌన్ సీఐ ఉపేందర్, త్రీ టౌన్ సీఐ విద్యాసాగర్‌తో కలిసి ఏసీపీ రవిందర్‌రెడ్డి సెల్‌ఫోన్‌లను బుధవారం అందజేశారు. ఏసీపీ మాట్లాడుతూ ఎవరైనా సెల్‌ఫోన్‌లను పాగొట్టుకుంటే వెంటనే సీఈఐఆర్ యాప్‌లో వివరాలు నమోదు చేయాలని తెలిపారు.

◆ ఘనంగా ఆలయ వార్షికోత్సవం

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): జిల్లా కేంద్రంలోని వాసవీ కన్యకాపరమేశ్వరీ ఆలయ 42వ వార్షికోత్సవ వేడుకలు బుధవారం ఘనంగా కొనసాగాయి. బుధవారం ఉదయం నుంచే ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి అభిషేకం, సామూహిక కుంకుమ పూజలు, చండీ హోమం, అన్నప్రసాద, తదితర పూజ కార్యక్రమాలను భక్తులు నిర్వహించారు. సహస్ర సూర్య చంద్రుల దర్శనం (1000 పౌర్ణమిలు, 1000 అమావాస్యలు చూసిన వారు) చేసిన వారికి పాదపూజ, గౌరవ సన్మానం, శాస్త్రోపేతంగా అర్చకుల మంత్రాలతో వారి కుటుంబ సభ్యుల సమక్షంలో నిర్వహించారు.

◆ పొగాకు వాడొద్దని ర్యాలీ

సిద్దిపేటజోన్: టొబాకో ఫ్రీ స్కూల్ ఛాలెంజ్‌లో భాగంగా బుధవారం స్థానిక సెలెస్టియల్ స్కూల్ విద్యార్థులు పట్టణంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. పొగ పీల్చరాదని... పొగాకు ఆరోగ్యానికి హానికరమని నినాదాలు చేస్తూ ర్యాలీ చేపట్టారు. అంతకుముందు పాఠశాలలో వివిధ రకాల పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్లు హన్మంతారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి వైస్ ప్రిన్సిపాల్ విక్రమ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

◆ దేవాలయం కూల్చివేతపై ర్యాలీ

కొండపాక(గజ్వేల్): జూబ్లీహిల్స్‌లోని పెద్దమ్మ తల్లి గుడి కూల్చివేతకు నిరసనగా కుకునూరుపల్లిలో విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో బుధవారం ర్యాలీ తీసి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బీజేపీ మండల అధ్యక్షుడు సంపత్‌రెడ్డి మాట్లాడుతూ.. పాత పెద్దమ్మ తల్లి దేవాలయాన్ని దుండగులు కూల్చి వేసి విగ్రహాన్ని ఎత్తుకెళ్లినా ప్రభుత్వంలో చలనం లేకపోవడం దారుణమన్నారు. ఘటనను నిరసిస్తూ నిరసనలు తెలిపిన హైందవ సోదరులపై కేసులు నమోదు చేసి జైల్లో పెట్టడం అత్యంత హేయమైన చర్య అన్నారు. దేవాలయాన్ని కూల్చివేసిన దుండగులను గుర్తించి కఠినంగా శిక్షించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

విద్యార్థులకు వేడి ఆహారం ఇవ్వాలి

అదనపు కలెక్టర్ గరీమా అగర్వాల్



వంటను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

సిద్దిపేటరూరల్: వర్షాకాలం దృష్ట్యా విద్యార్థులకు వేడిగా ఆహారం ఇవ్వాలని అదనపు కలెక్టర్ గరీమా అగర్వాల్ అన్నారు. బుధవారం నారాయణరావుపేట మహాత్మాజ్యోతిరావుపూలే బీసీ బాలుర గురుకుల పాఠశాలను అదనపు కలెక్టర్ సందర్శించి రాత్రి భోజనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మెనూ ప్రకారం భోజనం అందించాలన్నారు. వంటగది, డైనింగ్ రూమ్‌లను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, శుద్ధమైన తాగునీటిని మాత్రమే తాగాలని సూచించారు. అనంతరం రోజువారీగా వివరాలు నమోదు చేస్తున్న రికార్డులను పరిశీలించారు.

తారురోడ్డు వేయాలని నిరసన



రోడ్డుపై నిరసన తెలుపుతున్న యువకులు

అక్కన్నపేట(హుస్నాబాద్): గుంతల రోడ్డుపై ప్రయాణించి ప్రమాదాలకు గురవుతున్నామని గ్రామస్తులు తారురోడ్డు వేయాలని నిరసన తెలిపారు. బుధవారం అక్కన్నపేట మండలం కేశనాయక్‌తండా గ్రామ పరిధిలోని గొల్లపల్లి నుంచి చెరువుముందు తండా మీదుగా మైసమ్మ వాగుతండా వరకు దాదాపు 2 కి.మీ మేర రోడ్డంతా గుంతలు పడి ప్రమాదకరంగా మారింది. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. ఇటీవల కురిసిన వర్షానికి రోడ్డు పొడువునా గుంతలు పడ్డాయని, ద్విచక్రవాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారని వాపోయారు. ఉదయం, సాయంత్రం సమయాల్లో పాల కేంద్రానికి వెళ్లే వారి వాహనాలు అదుపులు తప్పి పడిపోయి గాయాల పాలవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఏళ్లతరబడి తారు రోడ్డు రోడ్డు సౌకర్యం కల్పించాలని పలుమార్లు విన్నవించిన ఎవరు పట్టించుకోవడంలేదని మండిపడ్డారు. ఇప్పటికైనా రోడ్డుకు మరమ్మత్తు చేసి తక్షణమే తారురోడ్డుకు నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరారు. లేని పక్షంలో పెద్ద ఎత్తున్న గ్రామస్తుల ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో గ్రామ మాజీ ఎంపీటీసీ సభ్యులు బండి సమ్మయ్య, తిరుపతి, భూక్య ప్రేమ్‌కుమార్, భాస్కర్, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలంలో ఇంటి నిర్మాణానికి యత్నం



పనులు నిలిపేసిన ఆర్ఐ, కార్యదర్శి

అక్కన్నపేట(హుస్నాబాద్): ప్రభుత్వ స్థలంలో ఇందిరమ్మ ఇల్లు నిర్మాణానికి ఓ వ్యక్తి యత్నించాడు. ఈ ఘటన అక్కన్నపేట మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ బాలికల, కళాశాల విద్యాలయం(కేజీబీవీ)లో చోటు చేసుకుంది. వివరాల ప్రకారం.. మండల కేంద్రంలోని సర్వే నంబర్ 387లో 5ఎకరాల్లో కేజీబీవీ పాఠశాల భవనం నిర్మాణానికి స్థల సేకరణ జరిగింది. కాగా హద్దు రాళ్లు మాత్రం ఏర్పాటు చేయలేదు. దీంతో పక్కనే ఉన్న ఓ రైతు ఇందిరమ్మ ఇల్లు నిర్మించుకునేందుకు ప్లాన్ చేశాడు. పిల్లర్లు వేసుకునేందుకు మార్కింగ్ కూడా వేశారు. ఈ క్రమంలో ఆర్ఐ యాదగిరి, పంచాయతీ కార్యదర్శి లక్ష్మీకాంతరావులు విషయం తెలుసుకొని సంఘటన స్థలాన్ని సందర్శించారు. ఇల్లు నిర్మించొద్దని సదరు వ్యక్తిని ఆదేశించారు. ఈ భూమి మీదేనని రుజు అయ్యే వరకు ఇంటి పనులు నిలిపేయాలని చెప్పారు. కాదని పనులు చేస్తే కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో కేజీబీవీ పాఠశాల ప్రత్యేక అధికారి సరిత తదితరులు పాల్గొన్నారు.

డ్రమ్ సీడర్‌తో అధిక లాభాలు

ఏఈఓ నాగార్జున



డ్రమ్ సీడర్ విధానంపై అవగాహన కల్పించిన నాగార్జున

తొగుట(దుబ్బాక): డ్రమ్ సీడర్‌తో వరి విత్తనాలు విత్తుకోవడం వల్ల రైతులకు అనేక లాభాలున్నాయని ఏఈఓ నాగార్జున పేర్కొన్నారు. బుధవారం మండలంలోని పెద్ద మాసాన్‌పల్లి రైతు పన్యాల సుదర్శన్‌రెడ్డి పొలంలో డ్రమ్ సీడర్‌తో వరి విత్తుకునే విధానంపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వర్షాలు ఆలస్యంగా కురవడం వరినారు పోసుకోవడానికి సమయం అనుకూలించకపోవడం వంటి పరిస్థితుల్లో డ్రమ్ సీడర్‌తో విత్తుకోవడం మంచిదన్నారు. అలాగే రైతులందరూ ఒకేసారి నాట్లు వేయడంతో కూలీల కొరత ఏర్పడి నాటు వేయడం ఆలస్యమవుతుందన్నారు. ఒక ఎకరా నాటువేయడానికి ఐదు వేలు ఖర్చు అవుతుందన్నారు. ఈ సమస్యను నేరుగా విత్తుకునే విధానంతో పరిష్కరించవచ్చునని తెలిపారు. ఈ పద్ధతిలో రైతు సరైన సమయంలో విత్తుకునే అవకాశముంటుందని చెప్పారు. అలాగే ఎకరానికి కేవలం 7కిలోల విత్తనం అవసరమవుతుందన్నారు. డ్రమ్ సీడర్‌తో సాగుచేయడం వల్ల కలుపు తీయడానికి కూలీలు అవసరం లేకుండా కోనో వీడర్ పరికరం సహాయంతో సులువుగా కలుపు తీసుకోవచ్చన్నారు. డ్రమ్ సీడర్‌తో సాగుచేస్తే ఎకరానికి రూ 8వేలు రైతుకు ఆదా అవుతుందని తెలిపారు. సకాలంలో కలుపు తీసినట్లైతే రైతులు అధిక దిగుబడులు పొందే అవకాశముంటుందని వివరించారు.

రేషన్ కార్డుల కల సాకారం

జిల్లా యువజన కాంగ్రెస్ సెక్రటరీ రాజారెడ్డి



రేషన్‌కార్డులను పంపిణీ చేస్తున్న నాయకులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): 10 సంవత్సరాల రేషన్ కార్డు కలను కాంగ్రెస్ ప్రభుత్వం సాకారం చేసిందని, జిల్లా యువజన కాంగ్రెస్ పార్టీ సెక్రటరీ ఎర్రబోలు రాజారెడ్డి అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని 2వ వార్డులో లబ్ధిదారులకు రేషన్‌కార్డులు పంపిణీ చేశారు. గత ప్రభుత్వం రేషన్‌లో దొడ్డు బియ్యం ఇచ్చారు. కానీ సీఎం రేవంత్‌రెడ్డి వచ్చాక పేద ప్రజలకు సన్నబియ్యం ఇస్తున్నారన్నారు. మహిళల కోసం ఉచిత బస్ సౌకర్యం కల్పిస్తున్నారన్నారు. మహిళలకు వడ్డీ లేని రుణాలు ఇస్తున్నారన్నారు. ఉచిత విద్యుత్, రాజీవ్ ఆరోగ్యశ్రీ, ఇందిరమ్మ ఇళ్ల వంటి అనేక సంక్షేమ పథకాలు చేపడుతున్నారన్నారు. కార్యక్రమంలో మహిళా నాయకులు పద్మశ్రీ రెడ్డి, వార్డు ఇన్‌చార్జి శ్రావణ్‌రెడ్డి పాల్గొన్నారు.

అప్పుల బాధ తాళలేక వ్యక్తి ఆత్మహత్య

సిద్దిపేటరూరల్: అప్పుల బాధ తాళలేక వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన సిద్దిపేట రూరల్ మండలం చింతమడకలో బుధవారం జరిగింది. గ్రామానికి చెందిన గుండెల్లి అంజయ్య(44) వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. కూతురు పెళ్లి కోసం అప్పు చేశాడు. అప్పు తీర్చే మార్గం కనిపించకపోవడంతో మానసిక ఒత్తిడికి గురయ్యాడు. ఈ క్రమంలో బుధవారం ఉదయం గ్రామానికి చెందిన ఓ వ్యక్తి వ్యవసాయ పొలం వద్ద చెట్టుకు ఉరివేసుకున్నాడు. అప్పుల బాధతో ఉరివేసుకొని చనిపోయినట్టు మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.



ఈత మొక్కలు నాటుతున్న అధికారులు

ఈత మొక్కలు నాటిన అధికారులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా బుధవారం సిద్దిపేట పట్టణ పరిధిలోని నర్సాపూర్‌లో జిల్లా ఎక్సైజ్ అధికారులు మొక్కలు నాటారు. 100కు పైగా ఈత మొక్కలు నాటారు. కార్యక్రమంలో టూ టౌన్ సీఐ ఉపేందర్, మున్సిపల్ మాజీ చైర్మన్ రాజనర్సు, మున్సిపల్ వైస్ చైర్మన్ కనకరాజు, కౌన్సిలర్‌లు నాయిని చంద్రం, యోగి, కోరె ఎల్లయ్య, రాములు, గౌడ సంఘం నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
యం. నాగరాజు-9010957373
రమేష్ - 9951952990